క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీనగర్ కాలనీలోని సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం మల్యాద్రి ఫెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఏటా కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. సుమారు 3 వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవరపు మల్యాద్రి, శ్రీనగర్ కాలనీ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు మాచవరంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం డౌన్ కుటుంబరావు వీధిలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఉత్సవకమిటీ అధ్యక్షులు కంచర్ల రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మట్లాడుతూ.. కళాకారులు సాంస్కృతిక వారధులని వారి సేవలను గుర్తించాలన్నారు. గాయనీ గాయకులు సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. గాయత్రి, పురుషోత్తమ దాస్‌లు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పాయకాపురం(విజయవాడరూరల్): ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అజిత్‌సింగ్ నగర్ అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.సుధాకర్ తెలిపారు. పైపులరోడ్, ప్రకాష్‌నగర్, కండ్రిక, డిమార్ట్ సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలను తెలియచేసే కరపత్రాలను మంగళవారం స్థానికులకు పంపిణీ చేశారు. పంట పొలాలు, గడ్డివాములు, ఇళ్లల్లో విద్యుత్, వంట చేసే సమయంలో గ్యాస్ లీక్‌తో జరిగే ప్రమాదాల గురించి ఆయన వివరించారు. గోడలపై స్టిక్కర్లను అంటించి అవగాహన కల్పించారు. స్టేషన్ సిబ్బంది శరత్ కుమార్, రవికుమార్, నగరాజు, అనిల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



హనుమంతు శంకర్(ఫైల్)

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాలుగు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన మధురానగర్‌లోని హనుమంతు శంకర్(38) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పాత ప్రభుత్వాసుపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించటంతో మృతి చెందారు. శంకర్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే శంకర్ మృతిచెందడంతో మధురానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్ నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ చేశారు. 58వ డివిజన్ నందమూరి నగర్‌కు చెందిన ఉప్పలపాటి ఝాన్సీ లక్ష్మికి రూ.89,294 చెక్కును అందజేశారు. మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి, ఆలా తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జారాయుళ్ల కోరల్లో బుడమేరు వాగు

- మట్టితో పూడ్చి రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- ప్రజాప్రతినిధుల అండతో సొమ్ము చేసుకుంటున్న వైనం
- ప్రేక్షక పాత్రలో అధికారులు



అయోధ్యనగర్‌లో ఆక్రమణలతో చదును చేసిన వాగు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బుడమేరు వాగు అడుగడుగునా ఆక్రమణలకు గురువుతోంది. అయోధ్యనగర్ బుడమేరు కట్టను కొందరు మట్టితో పూడ్చి వాటిని ప్లాట్‌లుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. దీనికి స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. డ్రెయిన్‌లపై నడిచేందుకు చిన్నపాటి బండలు ఏర్పాటు చేసుకుంటేనే చర్యలు తీసుకునే నగరపాలక సంస్థ అధికారులు బుడమేరు వెంట పదుల సంఖ్యలో అనాధికారికంగా ప్లాట్‌లు వెలుస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేయింబవళ్లు యథేచ్ఛగా పనులు..

కబ్జారాయుళ్లు రేయింబవళ్లు ట్రాక్టర్‌లు, లారీలతో బుడమేరులోకి మట్టిని తోలి వాటిని చదును చేసి ప్లాట్‌లుగా మలుస్తున్నారు. ఈ విధంగా చదును చేసిన ప్లాట్‌లను విక్రయించి లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. గతంలో నగరపాలక సంస్థ బుడమేరు వెంబడి ఎటువంటి ఆక్రమణలు జరగకుండా కట్ట వెంట సిమెంట్ దిమ్మెలు, ఐరన్‌తో పెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయినా ఆక్రమణదారులు వాటిని దాటుకుని అక్రమంగా మట్టితో బుడమేరును ఆక్రమించుకుంటున్నారు.

ఆక్రమణలతోనే బుడమేరుకు ముంపు..

గతేడాది బుడమేరు వరదతో ముంపునకు గురైన లక్షలాది మంది నిద్రాహారాలు వదలి ముంపులోనే చిక్కుకున్నారు. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన సంఘటనలకు బుడమేరు ఆక్రమణలే కారణమని ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ బుడమేరు ఆక్రమణలు నిత్యం యథేచ్ఛగా జరుగుతున్నా వాటిని నివారించడంలో ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులు పట్టీపట్టనట్లు ప్రేక్షక పాత్ర పోషించడంపై స్థానికులు మండిపడుతున్నారు. అయోధ్యనగర్ నుంచి న్యూ ఆర్‌ఆర్‌పేట వరకు అడుగడుగునా ఈ ఆక్రమణలు కనిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కబ్జాదారులు బుడమేరు వెంబడి ఆక్రమణలతో సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

గతంలో బుడమేరు వరద ముంపు సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగినప్పుడు ఆక్రమణలపై హడావుడి చేసిన అధికారులు తరువాత సమస్యను పట్టించుకోవడమే మానేశారు. ఈ ఆక్రమణల కారణంగా గతంలో కంటే ప్రస్తుతం బుడమేరు భారిగా కుచించుకుపోయింది. దీంతో భారి వర్షాలు, వరదల సమయంలో ప్రమాద స్థాయి ఎక్కువగా ఉంటుందని స్థానికులు భయందోళన చెందుతున్నారు. గతంలో బుడమేరు వరదల సమయంలో ఈ వాగుకు వరద ముంపు రాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. కనీసం బుడమేరులో జరుగుతున్న ఆక్రమణలనైనా నిర్మూలించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బుడమేరు వాగును మట్టితో పూడుస్తున్న దృశ్యం



పెన్సింగ్‌ను దాటుకుని వాగులోకి పాకిన ఆక్రమణలు

22 వరకు ఆరోగ్య రక్షణకు 'పోషణ్ పఖ్వాడా'

జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా లో ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించే 7వ పౌష్టికాహార పక్షోత్సవం (పోషణ్ పఖ్వాడా) సందర్భంగా స్పెషల్ డ్రైవ్ కింద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పోషణ్ పఖ్వాడా పోస్టర్లను ఆవిష్కరించారు. చిన్నారులు, మహిళల్లో ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలను కలెక్టర్ వివరించారు. పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాలను వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఇంటింటినీ సందర్శించాలన్నారు. పోషకాహారంపై ర్యాలీలు, సమావేశాలు తదితరాలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి, కోఆర్డినేటర్ సీహెచ్ సాయిగీత, డీఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాలయాపనగా బాబు పాలన

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పరాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారం చేపట్టిన చంద్రబాబు ల్యాండ్ పూలింగ్ పేరుతో రాజధాని ప్రాంతంలో రైతుల నుంచి వేల ఎకరాలు తీసుకుని అయిదేళ్ల పాటు తాత్కాలిక సచివాలయం, హైకోర్టు పేరుతో కాలయాపన చేశారని బహజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ఆనాడు తమ నుంచి బలవంతంగా భూములు లాక్కొవద్దని పేద రైతులు వేడుకున్నా కనికరించలేదన్నారు. రైతులు ఇచ్చిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. కాలం వెళ్లదీశారని విమర్శించారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయకపోగా విస్తరణ అవకాశాల పేరుతో మరో 44,676 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ లేదా నెగోషియేట్ సెటిల్మెంట్స్ లేదా భూసేకరణ చట్టం ద్వారా సమీకరించాలని టీడీపీ కూటమి సర్కారు ప్రకటన చేయడం సరికాదన్నారు. ఈ భూసేకరణ తంతు అంతా కేవలం కార్పొరేట్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచి పెట్టాలనే ఉద్దేశంతోనే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, ఉదయ్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ శామ్యూల్ కుమార్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా బీచ్ ఫెస్టివల్

డీఎస్డీఓలు, క్రీడాసంఘాలకు శాప్ చైర్మన్ రవినాయుడు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: మంగినపూడిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే బీచ్ ఫెస్టివల్‌లో క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. విజయవాడ శాప్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ జిల్లాల డీఎస్డీఓలు, కబడ్డీ, కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్‌ల నిర్వాహకులతో క్రీడల నిర్వహణపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ.. పక్కా ప్రణాళికలతో పకడ్బందీగా క్రీడాపోటీలను నిర్వహించి శాప్ గౌరవాన్ని మరింత పెంచాలని, దానికోసం క్రీడా అసోసియేషన్లతో పాటు డీఎస్డీఓలు అందరూ సమిష్టి కృషితో పనిచేయాలన్నారు. క్రీడలు నిర్వహించే అసోసియేషన్లకు శాప్ నుంచి కల్పించాల్సిన వసతులు, సౌకర్యాల ఏర్పాట్లను త్వరితగతిన తెలియజేయాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు మెరుగైన క్రీడావసతులు ఏర్పాటు చేయాలని వివరించారు.

హాజరుకానున్న జాతీయ క్రీడాకారులు..

కబడ్డీకి సంబంధించి 29 పురుషుల జట్లు, 29 మహిళా జట్లు పాల్గొంటాయన్నారు. బోట్ రేసింగ్, ట్రెడిషనల్ బోట్, సీ కాయిటింగ్ పోటీలకు వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ క్రీడాకారులు హాజరవుతారని వెల్లడించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించే బాధ్యత స్పోర్ట్స్ అథారిటీ తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా క్రీడాకారుల ప్రయోజనార్థం ట్రాన్స్‌పోర్ట్, పోలీసింగ్, ఫైర్, మెడికల్ క్యాంపులు, ప్రత్యేక కమిటీల పర్యవేక్షణపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సాయిబాబా, శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, పలువురు డీఎస్డీఓలు, కోచ్‌లు పాల్గొన్నారు.

20న ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిప్రసాద్ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, రాష్ట్ర ఆరోగ్య బడ్జెట్–విశ్లేషణ అనే అంశాలపై ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సును జయప్రదం చేయాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నపుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మన దేశంలో ప్రభుత్వ వైద్య రంగం రోజురోజుకు దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా రానున్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటైజేషన్ చేయడం దారుణమన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు అని, అందుకు రాజస్థాన్ తరహాలో రైట్ టూ హెల్త్ యాక్ట్‌ను మన రాష్ట్రంలో కూడా తీసుకురావాలన్నారు. ఈ నెల 20న జరిగే సదస్సులో మేధావులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు, మెడికల్, పారా మెడికల్ విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి, జనవిజ్ఞాన వేదిక నాయకుడు బి.రవికుమార్ పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోగల గవర్నర్‌పేట వద్ద ఉన్న 1137 కేఎల్ సామర్థ్యం గల తాగునీటి సరఫరా రిజర్వాయర్ – 2 అవుట్‌లెట్ వాల్వ్ మార్చనున్నందున ఈ నెల 17వ తేదీ సాయంత్రం తాగునీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సర్కిల్ – 3 పరిధిలోని 19వ డివిజన్ లబ్బీపేటలోని అమెరికన్ హాస్పిటల్ రోడ్, అన్నమయ్య రోడ్, పున్నమ్మతోట, ఆశ్రమం రోడ్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదు. అలాగే సర్కిల్ – 2 పరిధిలోని 23వ డివిజన్ లోగల గవర్నర్‌పేట, సూర్యారావుపేట, 24వ డివిజన్‌లోని న్యూ గిరిపురం, కస్తూరిభాయిపేట, ప్రాంతాలవారికి నీటి సరఫరా ఉండదు. ఈ నెల 18వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా నాటి సరఫరా జరుగుతుంది.

తవ్విన రోడ్డుపై రాకపోకలకు అవస్థలు!



దావు బుచ్చయ్యకాలనీలో వాటర్ పైపులైన్‌ల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్‌ల అలసత్వం కారణంగా 30వ డివిజన్ దావు బుచ్చయ్య కాలనీలో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. దావు బుచ్చయ్య కాలనీ డొంక రోడ్డు ఫస్ట్ క్రాస్‌రోడ్డు, సెకండ్ క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డును తవ్వి వాటర్ పైపులైన్ పనులు చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే తవ్విన రోడ్డును మాత్రం సరిచేయలేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీంతో గుంతలుగా మారిన రోడ్డుపై వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. వర్షాలు పడితే రోడ్డుసైతం బురదగా మారి ప్రజలు జారి పడిపోతున్నారు. మహిళలు, చిన్నారులు నానాయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును సరిచేయాలని కోరుతున్నారు.

ఉద్యోగం పేరిట మోసపోయిన మహిళ

పాయకాపురం(విజయవాడరూరల్): సైబర్ నేరాలపై పోలీసు శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ నేరగాళ్ల అమాయక ప్రజలను మోసం చేస్తునే ఉన్నారు. నున్న పోలీసు స్టేషన్ పరిధి కండ్రికకు చెందిన మాకం రాణి అనే మహిళ పార్ట్ టైమ్ జాబ్ ఆశతో ఇన్‌స్టాగాం మెస్సేజ్ చూసి మోసపోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. కండ్రిక కొండాలమ్మ గుడి దగ్గర నివాసం ఉంటున్న ఫిర్యాది రాణి ఈనెల 9వ తేదీన సైబర్ నేరగాళ్ల మొబైల్ నుంచి వచ్చిన మెస్సేజ్‌కు స్పందించారు. పార్ట్ టైమ్ జాబ్ కోసం ఆకర్షితులైన ఫిర్యాది మార్కెటింగ్ చేసేందుకు ముందుగా రూ.1000, పిమ్మట రూ.2 వేలు, టాస్క్ పూర్తి చేయడానికి రూ.12 వేలు, 3వ టాస్క్‌కి రూ.30 వేలు చొప్పున ప్రైవేటు బ్యాంకు ఖాతాకు పంపాలని మెస్సేజ్‌లు పెట్టి డబ్బులు కాజేశారు. చివరికి మీరు ఇచ్చిన టాస్క్ తప్పుగా చేశారు.. మీ అక్కౌంటు ఫ్రీజ్ అయ్యిందని అన్ ఫ్రీజ్ చేయడానికి మరో రూ.50 వేలు కట్టమని చెప్పడంతో అనుమానం వచ్చిన ఫిర్యాది నున్న పోలీసు స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కందుకూరి విశిష్ట పురస్కారానికి శామనపూడి ఎంపిక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఇచ్చే శ్రీ కందుకూరి విశిష్ట పురస్కారానికి ఎన్టీఆర్ జిల్లా నుంచి డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారని పాతబస్తీలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెంకటేశ్వరరావు పురస్కారాన్ని అందుకోనున్నారని తెలిపారు. డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు తమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తుండటం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. నాటక రంగంలో చంద్రమతి, చింతామణి మహిళల పాత్రలు, అలాగే హరిశ్చంద్రుడు, నక్షత్రకుడు పాత్రలకు వెంకటేశ్వరరావు పెట్టింది పేరు అని తెలిపారు. గతంలో పరిషత్ నాటకాలలో నంది అవార్డులు కూడా అందుకున్నారని వివరించారు.

నేటి నుంచి 44వ జాతీయ స్థాయి నాటికల పోటీలు

విజయవాడ కల్చరల్: పీఎమ్‌కే ఫైన్ ఆర్ట్స్, ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర వాణిజ్యమండలి ఆధ్వర్యంలో 16వ తేదీ నుంచి అయిదు రోజులపాటు 44వ జాతీయ స్థాయి సాంఘీక నాటికల పోటీలు నిర్వహిస్తునట్లు సంస్థ నిర్వాహకులు పసుపులేటి వెంకటరమణ మంగళవారం తెలిపారు. గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16వ తేదీ విముక్తి, ద్వార బంధాల చంద్రయ్య నాయుడు, మరీ అంతఒద్దు.. 17వ తేదీ దేవరాగం, మనసాక్షి, మోచేతి కంకణాలు.. 18వ తేదీ చీమ చీమ ఎందుకు కుట్టావ్, అమ్మ చెక్కిన బొమ్మ నాటకాలు ఉంటాయని తెలిపారు. 19వ తేదీన జానపద కళారూపాలు, 20న సినీ సంగీత విభావరి నిర్వహిస్తునట్లు ఆయన పేర్కొన్నారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

బస్టాండ్‌లో ధరల బాదుడు

ఏది కొనాలన్నా జేబులకు చిల్లులే

- ప్రతి వస్తువుపై అదనపు ధరలు వసూలు
- ఎమ్మార్పీ నిబంధనలు పట్టించుకోని స్టాల్స్ నిర్వాహకులు
- స్టాల్స్ ముందు కానరాని ధరల పట్టిక
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు



విజయవాడ బస్‌స్టేషన్

బస్టాండ్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోనే అతి పెద్ద బస్టాండ్ అది. అక్కడ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఏది కొనాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అల్పాహారం నుంచి పిల్లల బిస్కెట్లు, చాక్లెట్లు, భోజనం వరకూ దేని ధరలు చూసినా బెదరాల్సిందే. ఇది మరెక్కడో కాదు మన విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్(పీఎన్‌బీఎస్) లోనే.. పూర్తి వివరాలు ఇవి..

నిలువు దోపిడీ..

ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో అధిక ధరల విక్రయాలతో స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నారు. బిస్కెట్ ప్యాకెట్ నుంచి బిర్యానీ వరకు స్టాల్స్ నిర్వాహకులు నిర్ణయించిన ధరకే ప్రయాణికులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. బస్టాండ్‌లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలనే నిబంధన ఉన్నా, వాటిని అమలు చేయకుండా స్టాల్స్ నిర్వాహకులు ఒక్కో వస్తువుపై రూ. 5 నుంచి రూ. 10 వరకు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అవకాశాన్ని బట్టి వారు అందినకాడికి అధిక ధరలకు విక్రయాలు చేసుకుంటూ ప్రయాణికుల నుంచి ప్రతిరోజు రూ. లక్షల్లో ఆదాయం సమకుర్చుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అయితే వీరి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందంటూ పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు అడపాదడపా కేసులు పెట్టి, పెనాల్టీ విధించి తమ పని అయిపోయింది అనిపించుకోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు.

కనిపించని ధరల పట్టిక..

స్టాల్స్ ముందు ధరల పట్టిక ఉండాలనే నింబంధన ఉన్నప్పటికీ బస్‌స్టేషన్‌లో అది ఎక్కడ కనిపించడం లేదు. కొన్ని దుకాణాల ముందు ధరల పట్టిక ఉన్నా అది కనిపించకుండా దానికి అడ్డుగా డస్ట్‌బిన్‌లు పెట్టడం, ఫుడ్ ప్యాకెట్‌లను వేలాడదీసి ప్రయాణికులకు కనిపించకుండా చేస్తూ వారి జేబులకు చిల్లులు పెడుతున్నారు.

పెనాల్టీలు విధిస్తున్నా..

బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు చేపడుతున్నారు. అధిక ధరలు విక్రయాలు చేసినా, నాసిరకం ఆహార ఉత్పత్తులు అమ్మినా ఆయా స్టాల్స్ నిర్వాహకులపై పెనాల్టీ విధిస్తున్నారు. అయినప్పటికీ వారిలో మార్పు రావటం లేదు. కారణం వారికి వచ్చే అదనపు ఆదాయంతో పోల్చుకుంటే చెల్లించే పెనాల్టీ ఒక లెక్కే కాదంటూ ప్రయాణికులు చెబుతున్నారు. తనిఖీ అధికారులు అటు వెళ్లగానే యాథావిధిగా తమ దందా కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి పెనాల్టీలతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటే తప్ప వ్యాపారుల్లో మార్పురాదని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.

ఎమ్మార్పీ ధరలు అమలు కావడం లేదు..



బస్‌స్టేషన్‌లో వాటర్ బాటిల్, కూల్‌డ్రింక్ కొంటే వాటిపై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే అదనంగా ఐదు నుంచి పది రూపాయలు వసూలు చేశారు. అదేమని అడిగితే తగిన చిల్లర తెచ్చుకోవాలంటూ విసుక్కుంటూ.. డబ్బులకు బదులుగా బిస్కెట్ ప్యాకెట్‌ను చేతిలో పెట్టారు. దీనిపై అధికారులు నిరంతరం నిఘా పెట్టి ప్రయాణికులు నష్టపోకుండా చూడాలి.

– విజయలక్ష్మి, ప్రయాణికురాలు

కఠిన చర్యలు..

బస్టాండ్‌లోని దుకాణాల్లో అధిక ధరలు వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రయాణికుల నుంచి మూడు కంటే ఎక్కువ ఫిర్యాదులు వస్తే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తాం. నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలి.

– ఎం. శ్రీనివాసరావు, డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, పీఎన్‌బీఎస్